# చిత్రమాలిక

పంతులు—శాస్త్రి

## పునర్దర్శనం

"అన్నయ్యా! నువ్వు మరివెళ్లు. నీకు ఆఫీసుకి వేళయిపోతున్నాది. అక్కడికి వెళ్ళగానే రేపే మీ బావగారి చేత క్షేమంగా చేరుకొన్నట్టు ఉత్తరం రాయిస్తాను."

"అలాగే మరిచిపోకుండా ఉత్తరం రాయించు; నేను చెప్పిన పుస్తకాల మాట కూడా ఆయనతో చెప్పి, ఏమాత్రంవీలున్నా పంపించేయేర్పాటు చెయ్యి! మరి వస్తాను నేను - బాబూ! చిట్టీ! రమణా! మీఊరెళ్లి పోతున్నారుకదూ, మళ్లీ దసరాలకి రావాలి సుమండీ."

"అలాగే వస్తాం మామయ్యా! నువ్వు యీమారు మావూరు తప్పకుండా రావాలి."

"అమ్మయ్య! ప్రాణాలుకుదుటపడ్డాయి. ఇవాళ ఎంతమాత్రం రైలందుతుం దనుకో లేదు. ఏదో అదృష్టవశాత్తు మాకోసమే అన్నట్టుగా అరగంట లేటయింది. అయినా చిన్నప్పటినుండి చూస్తున్నాను, రైలు ఎక్కబోయేసరికల్లా "ఈ బండిలో ఖాళీ లేదు, ముందుదంతా ఖాళీ, అటువెళ్ళండనే వాళ్ళతప్ప, ఈలాగ "రండి, కూర్చోండి" అనేవాళ్ళే కనబళ్ళేదు. ఎలాగో రైలందితే చాలు, నిలబడి అయినా వెళ్ళిపోవాలనుకున్నాము."

"మంచిపనే, పిల్లలతో ఎంతకని నిలబడి ప్రయాణం చెయ్యగలరు? ఎక్కడివరకూ వెళ్తారు?"

"రాజమండ్రీ-అంటే గోదావరి స్టేషనుకి దగ్గర మాయిల్లు - అక్కడ దిగుతాము. మీరెంతవరకూ?"

"నేనా? నేను బెజవాడలో దిగి గుంటూరెళ్లాలి."

"అయితే మాకంటే చాలా దూరమే. మాకు కొసవరకు తోడుగా ఉంటారన్నమాటే. ఇటెక్కడినుండి వస్తున్నారు?"

"ఇటు శ్రీకాకుళంనుండి వస్తున్నాను. పిల్లలు చాలా బుద్ధిమంతులులాగే ఉన్నారు"

"వాళ్ళ బుద్ధిని మీరే మెచ్చుకోవాలి. వాళ్ళనాన్నగారు ఎంత పెంకెతనంచేసినా ఏమీ అనరు. ఒకొక్కప్పుడు వాళ్ళు చేసే పెంకెతనానికి నాకు మహా చికాకు వేస్తుంది; నేనేమన్నా వాళ్లకు లక్ష్యం లేదు."

"మీరలా మాటిమాటికీ లక్ష్యంలేదంటూ ఉంటేనే నిజంగా లక్ష్యం లేకుండా పోతుంది. అయినా రైలెక్కినదగ్గరనుండి చూస్తున్నాను. బుద్ధిగా కూర్చున్నారు. సామాన్యంగా పిల్లలు రైలెక్కితే ఎంత గొడవ చేస్తారు. ఏమమ్మా! నీ పేరేమిటి? ఏం చదువుకుంటున్నావు? మీ తమ్ముడూ, మీ అన్నయ్యానా? అంతా ఒకే స్కూల్లో చదువుకుంటున్నారా?......

తల్లి సరస్వతితో ఆరంభమయినపరిచయం పద్మావతికి పిల్లలతో స్నేహంగా పరిణమించింది కొంచెంసేపటిలోనే.

మొదట్లో కొంచెం మొగమాటంగా ఎడంగా ఉన్న బాబుకూడా కలిసిపోయేడు.

అంతవరకూ పద్మావతి చదువుతూండిన "భారతి" పత్రిక చూడ్డంలో నిమగ్నురాలయింది సరస్వతి.

పిల్లలు తమ చదువుసంధ్యలగురించి, ఆటపాటలగురించి, స్నేహితులగురించి, పంతుళ్ళనుగురించి పద్మావతికి వివరంగా చెప్పసాగారు. తమ స్నేహితులవిషయమో మాష్టర్ల సంగతో సరిగా తెలియక పద్మావతి ప్రశ్నిస్తే. ఈమాత్రం తెలియదా అన్నట్టుగా నవ్వి ఆమెకు వివరాలు తెలియజేసేవారు. తాము ఎంతో కష్టమయినవని అనుకొన్న పద్యాలు అప్పజెప్పేరు; పాఠాలలోని కథలు స్వంతమాటల్లో చెప్పారు.

అంతా ఒక అరగంటలో అయిపోయింది. పిల్లలకి ఉత్సాహం తగ్గిపోయింది.

రమణ కిటికీలోంచి చూసిచూసి, కునికిపాట్లు పడుతూఉంటే పద్మావతి నెమ్మదిగా పడుకోబెట్టింది.

బాబూ, చిట్టీ చెరోక కిటికీదగ్గరగా కూర్చొని దాటిపోయే పొలాలనూ చెట్లనూ విసుగులేకుండా చూస్తున్నారు.

సరస్వతి మూలకు చేరగిలబడి కూర్చొని పత్రికలోని ఏదోకథ శ్రద్ధగా చదువుతూంది. ఆమె మనసంతా కథలోనే లగ్నమయి ఉంది.

పద్మావతి, చేతిసంచీలోని ఇంగ్లీషు కథల పుస్తకం సామర్సెట్ మామ్ రాసిన క్రీచర్స్ ఆఫ్ సర్కమ్‌స్టెన్సెస్ చదువుకోడం మొదలుపెట్టింది.

కాని, ఎంత ప్రయత్నించినా చదువు సక్రమంగా సాగటంలేదు. ఏవేవో ఆలోచనలు మనసునివిడిచిపెట్టకుండా ఉన్నాయి.

బాబు, చిట్టి, రమణ - ఎంత చక్కగా ఉన్నారు పిల్లలు! ఇంత చక్కటి, బుద్ధి

"బాబు, చిట్టి, రమణ—ఎంత చక్కగా ఉన్నారు పిల్లలు! ఇంత చక్కటి, బుద్ధిమంతులయిన పిల్లలను కలిగిఉండడానికి ఈ ఇల్లాలికి ఉన్న ఎక్కువ అర్హత ఏమిటి? తనకు ఇటువంటి ఆనందము మరి లేనేలేదా?" అని తోటి ప్రయాణీకురాల్నిగురించి ఆలోచించసాగింది పద్మావతి.

"డాక్టరుగారూ! నేను వీణ నేర్చుకుంటున్నానని మీకు తెలుసుగా. ఇప్పుడు ఈ ఆపరేషన్ అయిన తరవాత, మళ్ళీ ఒక వారం రోజుల్లో వీణ వాయించటం మొదలుపెట్టవచ్చునంటారా?"

"వీణ సంగతి గ్యారంటీగా చెప్పలేనండీ. కిందటిసారి ఒక రోగికి ఇదేమాదిరి ఆపరేషన్ చేసినప్పుడు అతడు మర్నాడే ఫిడేలు వాయించగలిగాడు."

మంతులయిన పిల్లలను కలిగి ఉండడానికి ఈ ఇల్లాలికిఉన్న ఎక్కువ అర్హత ఏమిటి? తనకు ఇటువంటి ఆనందం మరి లేనేలేదా? ఈమెకు నిజంగా పిల్లలవల్ల తృప్తి ఆనందం ఎంతగా కలుగుతున్నాయో అంతగానే విసుగూ చీదరా కలుగుతున్నాయేమో?

ఈమెకు బహుశః తనవయస్సే ఉంటుంది. ఇంకా ఒకటి రెండు సంవత్సరాలు తక్కువే ఉంటాయేమో? కాని, మరి అయిదారేళ్లలో కూతురు పెళ్లిమాటల హడావిడిలో పడుతుంది; మరి కొంచెం సంవత్సరాలలో కొడుక్కివచ్చే సంబంధాలనుగూర్చిన ఆలోచనలు, కట్నకానుకలను గూర్చిన పట్టింపులు, అల్లుళ్లు కోడళ్లు-మనవలు...

ఈమె జీవితంలో ఒక విఘ్నమైన ముందుకి సాగిపోయే నదివంటి లక్షణం ఉంది. అది ఎప్పటికప్పుడు కొత్త కొత్తగా కనిపిస్తూ ఉంటుంది—అందులో పాతబడి మురిగిపోయే లక్షణం లేదు.

తన జీవితం—ఇందులో చలనం లేదు—ఎప్పుడూ ఒకటే స్కూలు—పాఠాలు—కాంపోజిషను పుస్తకాలు—ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం, రాత్రి—ఎప్పుడూ ఎల్లప్పుడూ తన దినచర్య ఒకేఒక మార్పులేని సూత్రాన్ని అనుసరించి సాగిగంతుంది. ఇందులో ఉత్సాహం, ఉద్వేగం, ఆకాంక్ష, ఆనందం అనే స్ఫురణలు ఏమీ లేవు— ......

సరస్వతి అంతసేపూ చదివినకథ పూర్తయింది కాబోలు మళ్ళీ కబుర్లకి అందుకొంది......

పద్మావతి ఏంచేస్తున్నది, ఎక్కడ ఉంటున్నది...

విని, "నేనూ నిజంగా బియే పాసయి ఉద్యోగం చేసుకోవాలనే అనుకున్నాను. మావాళ్లే పోనిచ్చారుకాదు; ఎలాగో ఊళ్లో హైస్కూలుందికదా అని స్కూలుఫయినలువరకూ చదవనిచ్చేరు. తరవాత, పెళ్ళి-కొత్తలో ఆయన ప్రయివేటుగా చదివిస్తానన్నారు. పుస్తకాలుకూడా కొన్నాం..."

"ఎంచేత చదవలేదు మరి?"

"సంసారంలో పడ్డాక మరి చదువు సాగేదేమిటిలెండి. మొదట ఒక ఆడపిల్ల పుట్టిపోయింది. తరవాత వీడు...ఆతరవాత మరి ఆ ఆశే లేకపోయింది. అయినా పరీక్షలు ప్యాసయి నేనేం చెయ్యాలి? ఇప్పుడు మరి ఉద్యోగం చేసేదిలేదుకదా?"

ప్రసంగధోరణి అలా సాగి సాగి, సరస్వతి భర్త ఉద్యోగంవంకకు మళ్ళింది.

భర్త ఉద్యోగం గురించి, లేని ఆస్తిపాస్తులనుగురించి, బంధుమిత్రుల గురించి నిస్సంకోచంగా చెప్పగలిగిన సరస్వతి అతని పేరు చెప్పవలసి వచ్చేవేళకు కొత్త పెళ్లికూతురులా సిగ్గుపడింది.

పద్మావతి "ఏదో మాటవరసకి అడిగేను, చెప్పక్కరేదులెండి" అంది—కాని సరస్వతికి పేరుచెప్పలేకపోవడం పరువుతక్కువగా తోచింది. కొంచెం పక్కగా తిరిగి, "ఆయనపేరు, శ్యామలరావు అందరూ శ్యామూ అంటారు." అంది.

పద్మావతి ఒకమారు తుళ్ళిపడినట్లయింది. ఎలాగో తనుతాను సంబాళించుకొని, ఇక మరి మనసుని పీడించే సందేహం ఎందుకుండాలీ అని మీ అత్తవారి ఇంటిపేరేమిటంది.

ఇంటిపేరు చెప్పడానికి సరస్వతి ఏమీ మొగమాటపడలేదు. కాని, పద్మావతికి మాత్రం మరి మాట్లాడాలనే కుతూహలం అంతరించిపోయింది.

తనలో తన కనిపిస్తూఉండేది. ఎందుకిలా అయిపోతున్నాను? చక్కగా, హాయిగా ఇందాకటిలాగ ఎందుకు మాట్లాడలేకపోతున్నాను? ఈవిడ నాగురించి ఏమనుకొంటుంది?

నిజమే, సందేహంలేదు, శ్యామలరావ్—ఇంటిపేరుకూడా సరిపోయింది ... అప్పటి రోజుల్లో తమవాళ్లు తనకు అతను తగిన వరుడు కాడని తోసిపుచ్చిన శ్యామలరావే—ఇప్పుడు మంచిఉద్యోగంలో ఉండి మూడువందలు తెచ్చుకొంటున్నాడట—

తీరా తను బియే. పాసయేవేళకి తనకి తగిన వరులు అసలే కనబడకుండా పోయారు. అందాకా కాలక్షేపానికని ఆరంభించిన ఉద్యోగం ఇదే స్థిరమయి ఊరుకొంది.

శ్యామలరావు ఇప్పుడెలా ఉన్నాడో? అక్కడకు స్టేషనుకి వస్తాడేమోకదూ? అయితే మాత్రం, తానతన్ని చూడగలదా?

సరస్వతి వద్దని ఎంతగా అంటూ ఉన్నా వినకుండా చిట్టి చేతిలో ఒక పది రూపాయల నోటు ఉంచింది. "ఇంతమాత్రంలో నాకేం కష్టంలేదు; పిల్లలు ఎంతో ముద్దొస్తున్నారు, వాళ్ళకి ఏదైనా కొనియ్యాండి" అంది—

రాజమండ్రి స్టేషనులో ఇద్దరికీ పువ్వులు కొంది—ఎంతో సరదాగా మాట్లాడింది.

అటువంటి పద్మావతి, గోదావరి స్టేషనులో దిగి వెళ్లిపోతూ ఆమె, పిల్లలు చెప్పిన మాటలు సరిగా వినిపించుకోనేలేదు—అవతలిపక్క కూర్చొని, తనసామాను సర్దుకోడంలో నిమగ్నరాలయిఉండి, ఆఁ ఆఁ అని ఎలాగో అంది—

జట్కాలో చిట్టి తన చేతిలోని నోటును గొప్పగా చూపించింది నాన్నగారికి - సరస్వతిఅంతా చెప్పుకొనివచ్చింది శ్యామలరావు "అరే చెప్పావుకాదు, సరిగా చూసి ఉండును, మా పద్మే అయిఉంటుంది" అన్నాడు—

"అంటే మీ కవిత్వప్రేయసి అనిదేనన్నమాట? మీ రేనయం, ఆవిడ ఒక్కమాటయినా తొణికిందికాదు చూసిండి అయినా అదృష్టవంతురాలు!"

"ఏం?"

"ఏమిటేమిటి, హాయిగా నెలజీతం, స్వేచ్ఛగా బట్టలూ, నగలూ" అందేకాని, తనమాటలో తనకే నమ్మకంలేదు సరస్వతికి—జట్కా ఇంటిదగిర ఆగింది— ★

96" × 54"
కాశ్మీర్ శాలువ
ధర రు. 2-8-0
వెంటనే వ్రాయండి.
GENERAL SUPPLY CO.,
(A P M) P. B. 1360, Delhi

ఉచితము
మీ అదృష్టము 1955-56
(పోస్టు బిళ్లలుగాని డబ్బుగాని పంపవద్దు)
ఒక పువ్వుపేరు తెలిపినా, లేదా పుట్టిన తేదీ తెలిపినా, లేదా ఉత్తరం వ్రాసేవేళ తెలిపినా చాలు. రాబోయే 12 నెలల తాలూకు సమగ్రమైన వివరాలు మీ బాధల పరిష్కార మార్గాలతో విజయ సాధనాలతో పంపబడును Mahalaxmi Jotish Ashram, P. B 1355, Delhi.

దాంపత్య రహస్యములు
ఇది పటములతో 254 పుటలుగలది వెల రు 2/-
కామ కళారంగము అను కోక్కోకము పటములతో రు 1/4-;
కామకళా లేక కోక్కోకము పటములతో వెల 1/-
మూడునుకొన్నచో పోస్టుఖర్చు రు1/ వ్రాయండి.
D S. మిత్రా & కో, 26 వీధి సౌకారుపేట మద్రాసు.